సూర్యలంకలో..
పర్యాటకుల సందడి

- తీరంలో 40 సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ ఉమామహేశ్వర్



తీరంలో పర్యాటకులు, టవర్‌పై నుంచి పరిశీలిస్తున్న ఎస్పీ బీ ఉమామహేశ్వర్

బాపట్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తికమాసం మూడో ఆదివారంతో మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో పర్యాటకులు, భక్తుల సందడి నెలకొంది. తుఫాన్ ప్రభావంతో 18 రోజులు తీరంలోకి పర్యాటకులను అనుమతించలేదు. ఈ క్రమంలో శనివారం నుంచి అనుమతించడంతో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. కాగా తీరంలో భద్రతా ఏర్పాట్లను ఆదివారం ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పరిశీలించారు. మెరైన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పోలీసు, మెరైన్ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో సముద్రంలోకి దిగడం, ఈతకొట్టటం నిషేధమని హెచ్చరించారు. తుఫాన్ తీవ్రత కారణంగా తీరంలో గోతులు ఏర్పడి ప్రమాదకరంగా ఉందన్నారు. కార్తిక సోమవారం పవిత్ర స్నానాలకు భక్తులు విశేషంగా విచ్చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తీరంలో ఎరుపురంగు జెండాలను దాటి ఎవరూ లోపలకు వెళ్లరాదన్నారు. సముద్రం లోపల, తీరం వెంబడి గస్తీ నిమిత్తం 10 పడవలతో పాటు గజ ఈతగాళ్లను, బ్లూకోర్టు వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. 40 సీసీకెమెరాలతో తీరంలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. సముద్రస్నానం మాత్రమే చేయాలని ఈతకొట్టరాదని, పోలీసుశాఖ సూచనలను తప్పనిసరిగా పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీలు జి.రామాంజనేయులు, ఎండీ మోయిన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, సీఐలు ఎం.శ్రీనివాసులు, పి.శేషగిరి తదితరులు ఉన్నారు.

శంకర్ ఆస్పత్రి.. సేవలు
అసమాన్యం

- సామాన్యులకు అందుబాటులోకి నేత్రవైద్యం
- పెదకాకానిలో నేత్రాలయం ఏర్పాటు మన అదృష్టం
- నూతన బ్లాక్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు


శంకర్ నేత్రాలయంలో అధునాతన మిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆస్పత్రి అందిస్తున్న సేవలు అసమాన్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఆదివారం గుంటూరుకు సమీపం పెదకాకానిలోని శంకర్ నేత్రాలయంలో ఐ కేర్ సూపర్‌స్పెషాలిటీ బీ-బ్లాక్‌ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి అక్కడ అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ పెదకాకానిలో శంకర్ నేత్రాలయ ఏర్పాటు అదృష్టంగా భావించాలన్నారు. ఐదు రాష్ట్రాల్లో 14 ఆస్పత్రుల ద్వారా ఇప్పటి వరకు 70 లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు జరిగాయని కొనియాడారు. సామాన్యులకు సైతం నేత్ర వైద్యం అందుబాటులో తీసుకొచ్చిన ఘనత కంచి కామకోటి పీఠానిదన్నారు. ప్రతిఒక్కరికీ కంటి వెలుగు అందేలా శంకర కంటి ఆస్పత్రి కీలకపాత్ర పోషించాలన్నారు. అనారోగ్యమే నిజమైన పేదరికం అని భావించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మానవసేవే.. మాధవసేవ

పేదరికం లేని సమాజం చూడాలన్నది జగద్గురు ఆది శంకరాచార్యుల కల. ఇది అసాధ్యం కాదు. అందరం అనుకుంటే సాధ్యం. దేశంలోని అన్ని పీఠాలకు కంచి కామ కోటి పీఠం ఆదర్శవంతం. ధర్మం, జ్ఞానం, సేవ మూల సిద్ధాంతాలుగా కంచి పీఠాన్ని ఆదిశంకరాచార్యులు తీర్చిదిద్దారు. మానవ సేవే మాధవ సేవ అని భావించి కంచి పీఠం వైద్య సేవలందిస్తుండటం స్ఫూర్తిదాయకం. కంచి పీఠం చేసే అన్ని కార్యక్రమాలకు అండగా ఉంటాం.

-ముఖ్యమంత్రి చంద్రబాబు

విద్య, వైద్యమే లక్ష్యం

విద్యార్థులకు నాణ్యమైన విద్య, రోగులకు మంచి వైద్యం, మందులు, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయం అందించడమే తమ లక్ష్యమని కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతిస్వామి తెలిపారు. కంచి పీఠం తరఫున చదువు, బలం, మంచిపేరు, కీర్తి, పుణ్యం తదితర ఐదు రకాల సేవలు నిత్యం అందిస్తున్నట్లు తెలిపారు. విశ్వశాంతి కోసం అనేకమైన ప్రార్థనలు, ప్రయత్నాలు ధర్మబద్ధంగా జరుగుతున్నాయన్నారు. విద్య, సంస్కృతి కలిపి శంకర స్కూల్స్ ప్రారంభం కానున్నాయని తెలిపారు. మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్ ఆర్.వి .రమణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సలహా మేరకు త్వరలో ఏఐ టెక్నాలజీ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు నరేంద్రకుమార్, జీవీ ఆంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, జీడీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, డాక్టర్ జేకే రెడ్డి, మురళీకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కేంద్రం.. కరుణించేనా

- రేపు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన
- మొంథా నష్టాలపై క్షేత్రస్థాయి పరిశీలన


బాపట్లలో నీటమునిగిన దోస పైరు (ఫైల్‌ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ పంటలతో పాటు రహదారుల విధ్వంసం, విద్యుత్ రంగానికి భారీగా నష్టాన్ని మిగిల్చింది. తీర ప్రాంత గ్రామాల ప్రజలు, మత్స్యకారులు తుఫాన్ బాధితులుగా మిగిలారు. ఈ నేపథ్యంలో తుఫాన్ నష్టాలను పరిశీలించడానికి కేంద్ర బృందం మంగళవారం జిల్లాలో పర్యటించనున్నది. పంటలకు తుఫాన్ మిగిల్చిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో కేంద్రబృందానికి చూపించి వ్యవసాయశాఖ వివరించనున్నది. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వ్యవసాయశాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నష్టాలను కేంద్ర బృందానికి వివరించడానికి సన్నద్ధమవుతున్నారు. తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా కేంద్ర బృందం ముందుంచేలా కలెక్టర్ వినోద్‌కుమార్ సారథ్యంలో యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మొంథా ఏ స్థాయిలో జిల్లాపై విరుచుకుపడిందో ఆ బృందానికి వివరించి చెప్పడంతో పాటు, నష్టం లెక్కలపై వారు సంతృప్తి వ్యక్తం చేసేలా చూడాల్సిన బాధ్యత జిల్లాయంత్రాంగానిదే. ఉద్యాన పంటలతో కలిపి 39 వేల ఎకరాలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ ఇప్పటికే తేల్చింది. విద్యుత్‌శాఖకు రూ.3 కోట్లు, రహదారుల మరమ్మతులకు రూ.15 కోట్లు, చెట్లు తొలగింపు, బాధితులకు రిలీఫ్ క్యాంపులు, ఆర్థిక సాయం, నిత్యావసరాల అందజేత వీటికోసం రూ.5 కోట్ల వరకు అదనపు భారం పడింది. ఇక మత్స్యకారుల జీవనోపాధిపై ప్రభావం, తీరంలో వ్యాపారాలకు గండి వంటివి నష్టాలకు అదనంగా ఉన్నాయి

కేంద్ర బృందం షెడ్యూల్ ఇలా...

సోమవారం రాత్రికే చీరాల చేరుకోనున్న కేంద్ర బృందం అక్కడి అతిథిగృహంలో బస చేయనుంది. మంగళవారం ఉదయం రామాపురానికి రోడ్డు మార్గంలో వెళ్లనున్న బృందం అక్కడ దెబ్బతిన్న పంటలను, రహదారులను పరిశీలించనున్నది. అక్కడి నుంచి వాడరేవుకు వెళ్లి ఛిద్రమైన రోడ్లను, కోతకు గురైన తీర ప్రాంతాన్ని పరిశీలించనున్నది. అక్కడి నుంచి రోడ్డ మార్గంలో బాపట్లలోని కలెక్టరేట్‌కు కేంద్ర బృందం చేరుకోనుంది. అధికారులతో సమీక్ష అనంతరం మొంథా మిగిల్చిన నష్టాన్ని ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా బృందం పరిశీలించనుంది. మధ్యాహ్నం 12 గంటలకు కేంద్ర బృందం విజయవాడకు తిరిగి వెళ్లనున్నది.

ఘనంగా మంత్రి గొట్టిపాటి జన్మదినోత్సవం

53 కిలోల కేక్ కట్.. 876 మందికి కంటి పరీక్షలు



అద్దంకిలో 53 కిలోల కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నేతలు


మెగా ఉచిత కంటి వైద్యశిబిరం వద్ద బారులు తీరిన రోగులు

అద్దంకి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఆదివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ 53వ జన్మదినోత్సవాలు ఘనంగా జరిగాయి. అద్దం కిలో దివ్యాంగుల చేత టీడీపీ నాయకులు 53 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి కేక్‌ను కట్ చేయించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పాలకమండలి సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. వేయిస్తంభాల గుడిలో దీక్షా భక్తులకు అన్నదానం నిర్వహించారు. అద్దంకిలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో శంకర కంటి ఆస్పత్రి వైద్యులు 876 మందికి పరీక్షలు నిర్వహించి 300 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరో 300 మందికి కళ్ళజోళ్ల అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయమిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు, టీడీపీ అద్దంకి మండల, పట్టణ అధ్యక్షులు మానం మురళీ మోహన్‌దాస్, గరిగెల నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కరి పరమేష్, చాగంటి రాజేంద్ర, కుందారపు రామారావు, సందిరెడ్డి రమేష్, కోనేటి అనిల్, చుండూరి మురళీసుధాకరరావు, గుంజి శ్రీనివాసరావు, లహరి, రామాంజ నేయులు, అత్తులూరి రమేష్, యేజెండ్ల నాగ రాజు, మాగులూరి గోపి, కొమ్మాలపాటి సుధీర్, నర్రా శ్రీనివాసబాబు, నాదెండ్ల సుబ్బారావు, కఠారి నాగేశ్వరరావు, పెంట్యాల రామాంజ నేయులు, కరిముల్లా, పూనాటి విక్రమ్, యర్రా రాఘవయ్య, గోగులమూడి రాజశేఖర్ పాల్గొన్నారు.

వెంగళాయపాలేనికి..
సరోవరం

- పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధి
- పీఎంకేఎస్‌వై 2.0లో రూ.1.20 కోట్లతో పనులు


చెరువు కట్ట ఆవరణలో కొబ్బరి, అరటి చెట్లను నాటుతున్న సిబ్బంది



- ఆరోగ్యం, ఆహ్లాదంతో పాటు ఆదాయంపై ప్రయోగం
- ఇక్కడ విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలు
- చెరువు పరిశీలనకు రేపు కేంద్ర, రాష్ట్ర మంత్రుల రాక

గుంటూరు శివారులోని వెంగళాయపాలెం చెరువుకు మహర్దశ పట్టింది. వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై) 2.0తో చెరువుకు కేంద్ర ప్రభుత్వం వరమిచ్చింది. పిచ్చిచెట్లు.. గోతులు.. అపరిశుభ్ర పరిసరాలతో అధ్వానంగా ఉండే చెరువు సర్వాంగ సుందరంగా మా రింది. గతంలో గ్రామంలోని వారికే పట్టని చెరువు ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందింది. పెద్దలకు ఆరోగ్యం, పిల్లలకు ఆహ్లాదకరం అందించడంతో పాటు స్వయం సమృద్ధి చెంది ఆదాయం ఆర్జించేలా అభివృద్ధి చేశారు. వాటర్ షెడ్ పథకంలో మోడల్ ప్రాజెక్టుగా వెంగళాయపాలెంలో చెరువు పునరుద్ధరణ చేపట్టారు. చెరువు కట్ట పటిష్టంతో పాటు కొబ్బరి మొక్కలు, వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్లు, జిమ్, పార్కు వంటి సౌకర్యాలతో నందనవనాన్ని తలపిస్తోంది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన చెరువును పరిశీలించేందుకు మంగళవారం కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 130 మంది ప్రతినిధులు రానున్నారు.

గుంటూరు(తూర్పు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకుని వాటర్‌షెడ్‌కు సంబంధించిన జాతీయ స్థాయి సదస్సుని గుంటూరులో జరిగేలా చేయడంతో పాటు వెంగళాయపాలెంలో వాటర్ షెడ్ పథకం కింద రూ.1.20 కోట్లతో చెరువు పునరుద్ధరణ చేశారు. దీంతో ప్రస్తుతం చెరువు పర్యాటక ప్రాంతంగా మారింది. 23.5 ఎకరాల్లో విస్తరించిన వెంగళాయపాలెం చెరువును గతంలో గ్రామస్థులు తాగునీటి అవసరాలకు వినియోగించుకునేవారు. క్రమేణా గ్రామంలో తాగునీటికి ప్రత్యామ్నాయంతో పొలాలకు సాగునీరు, పశువులకు తాగునీటి అవసరాలకే చెరువు (మిగతా 7లో)


నల్లపాడు లయోలా పాఠశాలలో జరుగుతున్న వాటర్ షెడ్ మహోత్సవ సభ ఏర్పాట్లు


చెరువు ఆవరణలో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు


వెంగళాయపాలెం చెరువు

దిక్సూచి

జాతీయ స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో(ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ) ప్రవేశానికి ఉద్దేశించిన జేఈఈ మెయిన్ షెడ్యూల్ ఆరంభమైంది. మొదటి సెషన్ జనవరి 21 నుంచి జరుగనుంది. తదుపరి రెండు నెలలూ ఇంటర్ పరీక్షలతో బిజీబిజీ. అపై ఏప్రిల్ నెలలో రెండోసెషన్ ఉంటుంది. అంటే పది నుంచి పదిహేను రోజుల వ్యవధి మాత్రమే ప్రిపరేషన్‌కు అప్పుడు సమయంఉంటుంది. అలాగే జనవరి సెషన్‌లో ఏదైనా పొరపాటు జరిగితే రెండోదైన ఏప్రిల్ సెషన్‌లో మెరుగుపర్చుకోవచ్చు. ఆ నేపథ్యంలో జనవరి సెషన్‌లోనే మంచి స్కోర్‌కు గట్టి ప్రయత్నం చేయడం మంచిది. అలా చేస్తే ఇంటర్ పరీక్షల తరవాత జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ప్రిపేరయ్యేందుకు సరిపోను సమయం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో జనవరి సెషన్‌లో మంచి స్కోర్ సాధించేందుకు అనుసరించాల్సిన ముఖ్యమైన కొన్నింటిని చూద్దాం. ప్రధానంగా ఈ సారి ఆన్‌లైన్ ప్రశ్నపత్రం ఫాంట్‌ను పెంచుకునే, తగ్గించుకునే వెసులుబాటును కల్పిస్తున్నారు.

జేఈఈ మెయిన్
జనవరి సెషన్ బెస్ట్



- ఇంటర్ రెండేళ్ళ సిలబస్ - మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విషయంలో ఈ నెల నుంచే గట్టి పునాదిని ఏర్పర్చుకోవాలి. ముఖ్యంగా ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్‌పై దృష్టిపెట్టాలి. డెబ్బయ్ నుంచి ఎనభై శాతం ప్రశ్నలు ఫౌండేషన్స్‌పైనే ఆధారపడి ఉంటాయని గమనించాలి.
- ఫాస్ట్ రివిజన్ షీట్స్‌ను తయారు చేసుకోవాలి. వాటిలో అన్ని ముఖ్యమైన ఫార్ములా, రియాక్షన్, ఈక్వేషన్‌ని ఒకే చోట సబ్జెక్టువారీగా రాసుకోవాలి.
- ప్రిపరేషన్ సమయంతో ప్రతి రెండు సబ్జెక్టుల మధ్య ట్రాన్సిషనల్ గ్యాప్‌ని తప్పనిసరిగా ఉంచుకోవాలి. పరీక్ష సమయంలోనూ ఇదే పద్ధతిని అనుసరించాలి. జిగ్‌జాగ్ లేదంటే ర్యాండమ్ అటెంప్ట్‌లు అస్సలు చేయకూడదు.
- కాలేజీ ముగిసిన తరవాత రోజూ కనీసం నాలుగు గంటల సమయాన్ని స్టడీకి కేటాయించాలి. థియరీతోపాటు కచ్చితంగా న్యూమరికల్స్‌ను సాల్వ్‌చేయాలి. కాలిక్యులేటర్‌ను ఉపయోగించవద్దు. అటెంప్ట్‌లో ఏదైనా పొరపాటు జరిగితే వెంటనే మీ నోట్స్ లేదంటే పాఠ్యపుస్తకాన్ని రిఫర్ చేయండి.
- టైమ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. గడిచిన కొన్నేళ్ళ ప్రశ్నపత్రాలను సాల్వ్ చేయడం ద్వారా ఒక నిర్దిత అంచనాకు రావచ్చు. ఏ సబ్జెక్టులో ఏయే కాన్సెప్టుల్లో సులువైన ప్రశ్నలు వస్తున్నాయో తెలుసుకోవచ్చు. తద్వారా వాటిపై శ్రద్ధపెట్టవచ్చు. ఉదాహరణకు ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి సులువైన ప్రశ్నలు ఎక్కువగా వస్తున్నాయి. అక్కడ మిగిలిన సమయాన్ని కష్టమైన ప్రశ్నలను సాల్వ్ చేసేందుకు ఉపయోగించుకోవచ్చు.
- ప్రతి వారం కనీసం రెండు మాక్‌టెస్టులను ప్రాక్టీస్ చేయాలి. టెస్ట్ పూర్తయ్యాక ఎర్రర్ అనాల్సిస్ చేసుకోవాలి. ఏ టాపిక్‌లో ఎక్కువ తప్పులు దొర్లుతున్నాయో గమనించి, ఆ కాన్సెప్ట్‌ని మరో సారి రివైజ్ చేసుకోవాలి.
- అన్ని చాప్టర్లు అని కాకుండా ఏ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో గమనించాలి. మేథ్స్‌లో కాలిక్యులస్, జామెట్రీ; ఫిజిక్స్‌లో మెకానిక్స్, ఎలక్ట్రిసిటీ; కెమిస్ట్రీలో ఆర్గానిక్‌కు ఎక్కువ వెయిటేజ్ ఉంటుంది.
- మాక్ టెస్టుల్లో స్కోర్ యావరేజ్ అంటే 150కి మించేలా చూసుకోవాలి. ఒకవేళ తగ్గినట్లయితే ఒక చాప్టర్‌పై అవగాహన ఉన్నప్పటికీ చిన్నపాటి తప్పులు ఎలా, ఎందుకు జరుగుతున్నాయో గమనించాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- గెస్ వర్క్ అస్సలు చేయవద్దు. పరీక్షలో కూడా ఎలిమినేషన్ పద్ధతి ఫాలో అవ్వండి. ఎంసీక్యూలో రెండు లేదా మూడు ఆప్షన్స్ తప్పు అని నిక్కచ్చిగా తెలిస్తే జవాబును గుర్తించడం సులువు అవుతుంది.
- అసలు ఎగ్జామ్‌లో కూడా సులువు నుంచి మోడరేట్‌గా ఉండే ప్రశ్నలు, అలాగే మీకు నచ్చిన సబ్జెక్టుతో అటెంప్ట్ మొదలుపెట్టండి. ఇందుకోసం ముందు మొత్తం పేపర్‌ని విశ్లేషించుకోవాలి. అందుకు కనీసం పది నిమిషాలు కేటాయించుకోవాలి. ఒక్క విషయం, కొన్ని సంవత్సరాల ప్రశ్నపత్రాల సరళిని గమనిస్తే, మేథ్స్‌లో అడిగే ప్రశ్నల నిడివి ఎక్కువగా, కఠినంగానూ ఉంటున్నాయి. ఫిజిక్స్‌లో కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు వస్తున్నాయి. కెమిస్ట్రీలో సులువుగా, ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ ఆధారంగా ప్రశ్నలు వస్తున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రిపరేషన్ కొనసాగించడం చాలా మంచిది.
- అన్నింటికీ మించి సరైన ఆహార అలవాట్లు, తగిన నిద్ర తప్పనిసరి. డిజిటల్ అడిక్షన్‌కు దూరంగా ఉండటం తప్పనిసరి. అలా చేస్తే ఆరోగ్యం బాగుంటుంది. మానసిక ప్రశాంతత పెరిగి మంచి స్కోర్ సాధించే వీలు ఉంటుంది.

- డాక్టర్ పవన్ కుమార్ కాసు
ఎక్సలెన్సియా, హైదరాబాద్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో
లోకల్ బ్యాంక్ ఆఫీసర్స్

పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) దేశవ్యాప్తంగా ఉన్న వివిధ శాఖల్లో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్(ఎల్‌బీఓ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీటిలో తెలంగాణలో 88, ఏపీలో 5 పోస్టులు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం ఏడాదిపాటు క్లరికల్/ అధికారి కేడర్‌లో బ్యాంకింగ్ రంగంలో పనిచేసి ఉండాలి.
వయస్సు: 20-30 సంవత్సరాల మధ్య.
ఎంపిక: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, లోకల్ లాంగ్వేజ్ పరీక్ష ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 23
వెబ్‌సైట్: https://pnb.bank.in/

ఎన్‌సీపీఎల్‌లో డిప్యూటీ మేనేజర్లు

ముంబైలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో 114 డిప్యూటీ మేనేజర్(హెచ్‌ఆర్ 31. ఎఫ్ అండ్ ఎ 48, సీఅండ్ ఎంఎం 34, లీగల్ 1), 8 హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టులు ఉన్నాయి. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 27లోగా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం www.npcilcareers.co.in /www.npcil.nic.in. చూడవచ్చు.

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) 110 అసిస్టెంట్ గ్రేడ్-ఎ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. జనరల్ 56, లీగల్ 20, ఐటీ 22, రిసెర్చ్ 4, అఫీషియల్ లాంగ్వేజ్ 3, ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్ 2, సివిల్ 3) పోస్టులు ఉన్నాయి.

అర్హత: పోస్టును బట్టి ఏదైనా పీజీ/ ఇంజనీరింగ్ డిగ్రీ/ లాలో డిగ్రీ ప్లస్ రెండేళ్ళ అనుభవం.
ఎంపిక: రెండో దశలో ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 28
వెబ్‌సైట్: www.sebi.gov.in



బెల్‌లో 340 ప్రొబేషనరీ ఇంజనీర్లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) 340 ప్రొబేషనరీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు: ప్రొబేషనరీ ఇంజనీర్స్(ఎలక్ట్రానిక్స్ 175, మెకానికల్ 109, కంప్యూటర్ సైన్స్ 42, ఎలక్ట్రికల్ 14 పోస్టులు ఉన్నాయి)
అర్హతలు: కనీసం 60 శాతం మార్కులతో ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్/ మెకానికల్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయస్సు: ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 25 సంవత్సరాలకు మించకూడదు. రిజర్వ్‌డ్ వర్గాలకు సడలింపు ఉంటుంది.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 14
వెబ్‌సైట్: https://bel-india.in/

జాబ్ కార్నర్

ఐబీలో 258 మంది ఆఫీసర్స్

కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరోలో 258 అధికారుల(అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/టెక్) పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది.

పోస్టులు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(90), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్(168) పోస్టులు ఉన్నాయి.
అర్హత: ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సైన్సెస్‌లో పీజీ(ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రానిక్స్‌తో ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) లేదా ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. 2023, 2024, 2025 గేట్ ఎగ్జామ్(కోడ్ ఈసీ/ సీఎస్)లో నిర్దేశిత అర్హతతో కటాఫ్ మార్కులు సాధించి ఉండాలి.
ఎంపిక: నైపుణ్య పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబర్ 16
వెబ్‌సైట్: www.mha.gov.in/www.ncs.gov.in

ఎన్‌హెచ్‌ఏఐలో...

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధపోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టులు: డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్) 9, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ 1, జూనియర్ ట్రాన్స్‌లేషన్ అధికారి 1, అకౌంటెంట్ 42 స్టెనోగ్రాఫర్ 32.
పోస్టునుబట్టి ఎంపిక ప్రక్రియ ఉంది. అర్హతలు విడివిడిగా ప్రకటనలో ఇచ్చారు.
అఖరు తేదీ: డిసెంబర్ 15
వెబ్‌సైట్: nhai.gov.in/

నీట్ ఎస్ఎస్ రిజిస్ట్రేషన్

నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ - నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ - సూపర్ స్పెషాలిటీ(నీట్ ఎస్ఎస్) 2025కి సంబంధించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆరంభించింది. నవంబర్ 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనిలో సాధించిన మెరిట్ ఆధారంగానే వైద్యవిద్య సంస్థలు అందించే డీఎం, ఎంసీహెచ్, డీఆర్ఎన్‌బీ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తారు. డిసెంబర్ 26, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా ఈ టెస్ట్ జరుగుతుంది. అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. **వెబ్‌సైట్:** exam.natboard.edu.in/



టీఐఎఫ్ఆర్‌హెచ్‌లో అడ్మిషన్

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ - హైదరాబాద్(టీఐఎఫ్ఆర్‌హెచ్) కెమిస్ట్రీ, ఫిజిక్స్ అడ్మిషన్ బోర్డులు కలిపి పీహెచ్‌డీ అండ్ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ - పీహెచ్‌డి ప్రోగ్రామ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్‌లో నాలుగు ఖాళీలు ఉన్నాయి. కోర్సు వచ్చే ఏడాది జనవరి నుంచి ఆరంభమవుతుంది. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
వెబ్‌సైట్: https://gasadmissions.tifrh.res.in
అకడమిక్ కోఆర్డినేటర్ ఈమెయిల్: gasadmissions@tifrh.res.in

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పెళ్లి షురూ



ప్రియదర్శి ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే'. శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు. వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రామవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.

క్రైమ్ థ్రిల్లర్



వజ్ర యోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వంలో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'సీమంతం'. ప్రశాంత్ టాటా నిర్మాత. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్, అపరాధపరిశోధనాత్మక కథనంతో రూపొందిన చిత్రమిది. హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా తెరకెక్కించాం. విలన్ పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'మహిళల వరుస హత్యల కేసు నేపథ్యంలో అల్లుకున్న కథ ఇది. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగుతుంది' అని తెలిపారు.



పెద్దితో ఆ కోరిక తీరింది

రామ్‌చరణ్

'సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్‌తో పనిచేయాలనేది నా కల. అది 'పెద్ది' చిత్రంతో నెరవేరింది' అని అన్నారు రామ్‌చరణ్. ఏఆర్ రెహ్మాన్ సంగీత విభావరి రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగింది. రామ్‌చరణ్, జాన్వీకపూర్, దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామ్‌చరణ్, జాన్వీకపూర్ జంటగా బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' నుంచి 'చికిరి' పాట లిరికల్ వీడియోను తెరపై ఆవిష్కరించారు. రెహ్మాన్ తనయుడు ఏఆర్ అమీన్ ఈ పాటను వేదికపై ఆలపించారు. ఈ సందర్భంగా రెహ్మాన్ మాట్లాడుతూ 'నా సంగీత ప్రయాణం తెలుగులోనే ఆరంభమైంది. 'బాహుబలి', 'పుష్ప', 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి సినిమాలతో తెలుగు సినిమాకు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గుర్తింపు, ఆదరణ ఎంతో సంతోషాన్నిస్తోంది. 'నాటు నాటు' పాట ఆస్కార్ గెలవడం మనందరికీ గర్వకారణం' అని చెప్పారు.

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో



ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు వెండితెరకు పరిచయమౌతున్నాడు. కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరుడు, దివంగత రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నారు. 'ఆర్ఎక్స్ 100', 'పలాస' చిత్రాల దర్శకుడు అజయ్‌భూపతి దర్శకత్వంలో జయకృష్ణ హీరోగా ఓ చిత్రం తెరకెక్కనుంది. ఆదివారం ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు అజయ్ భూపతి. వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వినీ దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు పిక్చర్స్ లిమిటెడ్ బేనర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. వర్కింగ్ టైటిల్ 'ఏబీ4'.

వేధింపుల కేసులో ఊహించని మలుపు

సోషల్ మీడియాలో (ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో) మార్ఫింగ్ చేసిన ఫొటోలు, నిరాధార ఆరోపణలతో తనను వేధిస్తున్నారని కథానాయిక అనుపమా పరమేశ్వరన్ కొన్ని రోజుల క్రితం కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు ఊహించని మలుపు తీసుకుంది. ఎవరో ఆకతాయిలు, పోకిరీ వ్యక్తులు అనుపమను వేధిస్తున్నారని భావించారు. అయితే ఆమెపై వేధింపులకు పాల్పడింది అబ్బాయిలు కాదు, ఓ 20 ఏళ్ల యువతి అని పోలీసుల దర్యాప్తులో తేలింది. తమిళనాడుకు చెందిన నిందితురాలు పలు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లను సృష్టించి, అనుపమను లక్ష్యంగా చేసుకొని, అభ్యంతరకర పోస్టులు పెట్టినట్లు తేలింది. నిందితురాలు పిన్న వయస్కురాలు కావడంతో ఆమె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎలాంటి వివరాలను బహిర్గతం చేయదలుచుకోలేదు అని అనుపమ తెలిపారు. అయితే ఈ కేసులో చట్టపరమైన చర్యలు మాత్రం కొనసాగుతాయని చెప్పారు. సైబర్ వేధింపులు శిక్షార్హమైన నేరం, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అనుపమ కోరారు.



చిరంజీవిని క్షమాపణలు కోరిన రామ్ గోపాల్





తన తొలి సినిమా 'శివ' రీ రిలీజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవికి కృతజ్ఞతలు చెప్పడంతో పాటు ఆయన్ను క్షమాపణలు కోరారు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఆయన దర్శకత్వం వహించిన 'శివ' చిత్రం ఈనెల 14న రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ వీడియో సందేశంలో చిత్ర బృందాన్ని అభినందించారు. "శివ' సినిమా చూసి నేను ఆశ్చర్యపోయా. అది సినిమా కాదు ఓ విప్లవం, తెలుగు సినిమాకి కొత్త నిర్వచనం ఇచ్చింది. ఈ చిత్రాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తుండటం మంచి విషయం. చిత్ర బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని చిరంజీవి అన్నారు. ఈ వీడియోను ఆర్జీవీ ఎక్స్‌లో షేర్ చేశారు. 'థాంక్స్ చిరంజీవి గారు.. అనుకోకుండా మిమ్మల్ని ఇబ్బంది పెట్టి ఉంటే ఈ సందర్భంగా క్షమాపణలు కోరుతున్నా. విశాల హృదయంతో మా చిత్ర బృందాన్ని అభినందించినందుకు కృతజ్ఞతలు' అని ట్వీట్ చేశారు. గతంలో పలు సందర్భాల్లో మెగా బ్రదర్స్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించారు రామ్ గోపాల్ వర్మ.

ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా...



'మసూద' ఫేమ్ తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా ఓ చిత్రం ఆదివారం ప్రారంభమైంది. భరత్ దర్శన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. ఓ హిలేరియస్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా ఉంటుందని, సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ అన్నారు. ఇందులోని ప్రతీ సన్నివేశం ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈనెల 19 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు మేకర్స్ అతి త్వరలోనే పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీవరప్రసాద్, సినిమాటోగ్రఫీ: సీహెచ్ కుషేందర్, సంగీతం: భరత్ మంచి రాజు.

వినోదం... విజ్ఞానం



వనాలను రక్షించుకోవాలనే సందేశంతో తెరకెక్కిన చిత్రం 'కలివి వనం'. రఘుబాబు, సమ్మెట గాంధీ, నాగదుర్గ ప్రధాన తారాగణం. రాజ్ నరేంద్ర దర్శకత్వంలో మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి నిర్మించారు. ఇటీవలె చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసి, రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. ఈనెల 21న 'కలివి వనం' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.వినోదంతో పాటు విజ్ఞానాన్ని ఇచ్చే చిత్రమిదని దర్శకుడు తెలిపారు.



మేఘాలయలో చిత్రీకరణ

- వేణు దోనేపూడి

'మ్యాడ్' ఫేమ్ విష్ణు ఓయ్, రాజా రవీంద్ర, విస్మయ్, టిన్ను ఆనంద్ ప్రధాన పాత్రధారులుగా గుణ మాచికంటి తెరకెక్కిస్తున్న చిత్రం 'బా బా బ్లాక్‌షీప్'. చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. మేఘాలయలో షూటింగ్ చేస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో టీమ్‌ను కలసిన మేఘాలయా ముఖ్యమంత్రి కన్రాడ్ కె సంగ్మా, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు దోనేపూడి మాట్లాడుతూ 'ఓ సినిమా పూర్తి షూటింగ్ మేఘాలయాలోనే జరగడం ఇదే ప్రథమం. ఒక్క రోజులో ఆరుగురు వ్యక్తుల మధ్య జరిగే ఆసక్తిరమైన క్రైమ్ కామెడీ ఇది. ఎప్పుడూ వర్షం పడుతూ ఉండే ఈ ప్రాంతంలో షూటింగ్ అంత సులువు కాదు. అయినా అన్ని సవాళ్లు స్వీకరించి ముందుకు సాగుతున్నాం' అని చెప్పారు. ఈ చిత్రంలో ఉపేంద్ర లిమియే, జార్జ్ మరియన్, రాజా అక్షయ్ లఘుసాని తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నాలుగు యుగాల నేపథ్యంలో



ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'గత వైభవ'. సింపుల్ సుని దర్శకత్వంలో దీపక్ తిమ్మప్ప నిర్మించారు. ఈ నెల 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'నాలుగు యుగాల నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రేమ, పునర్జన్మ, పురాణ గాథలను స్పృశిస్తూ సాగుతుంది. విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయి అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం తెలుగు హక్కులను నిర్మాతలు కే. నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి దక్కించుకున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: విలియం జే, సంగీతం: జుడా శాండి.

గొప్ప అనుభూతినిచ్చేలా..



కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రధారులుగా హరీశ్ రెడ్డి ఉప్పుల తెరకెక్కించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'జిగ్రీస్'. కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు హరీశ్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇందులోని అన్ని క్యారెక్టర్లతో మీరు కనెక్ట్ అవుతారు' అని చెప్పారు. నిర్మాత కృష్ణ వోడపల్లి మాట్లాడుతూ "జిగ్రీస్' ఒక కల్ట్ సినిమాగా ఉండబోతుంది. వినోదంతోపాటు భావోద్వేగాలూ ఉంటాయి' అని తెలిపారు.

కొత్త చిత్రం ప్రారంభం



త్రినాద్ వర్మ హీరోగా, వైష్ణవి కొల్లూరు, మలినా హీరోయిన్లుగా దర్శకుడు కే.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో అచ్యుత్ చౌదరి దర్శకత్వంలో 'ఇరువురు భామల కౌగిలి'లో అనే కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని దీపా ఆర్ట్స్ బేనర్‌పై శ్రీనివాస్ గౌడ్ నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్లపై నిహారిక కొణిదెల క్లాప్‌నివ్వగా దర్శకుడు బి.గోపాల్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు.

వెంగళాయపాలేనికి.. సరోవరం

(5వ పేజీ తరువాయి)

పరిమితమైంది. దీంతో పశువుల సంచారంతో చెరువు చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో రూపం కోల్పోయింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం చెరువుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. చెరువు చుట్టూ ఖాళీ స్థలంతో పాటు.. విశాలంగా ఉండటంతో జాతీయస్థాయిలో ఎంపిక చేసి, అమృత సరోవర్ అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు చుట్టూ కొబ్బరి చెట్లు, చెరువులో చేపల పెంపకానికి కూడా చర్యలు చేపట్టారు. తద్వారా ఆదాయం కూడా అర్జించేలా చెరువును అభివృద్ధి చేశారు. కొబ్బరి చెట్ల ద్వారా ఏడాదికి రూ.3 లక్షలు, చేపల పెంపకం ద్వారా రూ.2 లక్షలు పంచాయతీకి సమకూరుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలుకు పాలకులు, అధికారులు ఆలోచన చేస్తున్నారు.

రేపు పరిశీలన.. సభ

రెండు రోజుల వాటర్‌షెడ్ సదస్సు గుంటూరులో సోమవారం ప్రారంభమవుతుంది. కాగా చెరువును పరిశీలించేందుకు మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ రానున్నారు. ఆయనతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు కూడా రానున్నారు. ఆ తర్వాత వెంగళాయపాలెంలోని నల్లపాడు, లయోలా పాఠశాలలో వాటర్ షెడ్ మహోత్సవం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. చెరువుతో పాటు వెంగళాయపాలెం గ్రామంలో డివైడర్‌కు రంగులతో పాటు రోడ్డు మరమ్మతులు చేశారు. లయోలా పాఠశాలలో సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వాటర్‌షెడ్ మహోత్సవ్‌కి విస్తృత ఏర్పాట్లు

● గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్, పక్కన కలెక్టర్ అన్సారియా

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో సోమవారం నుంచి రెండు రోజులు జరిగే వాటర్‌షెడ్ మహోత్సవ్ కార్యక్రమాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేయాలని గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషణ్‌కుమార్ ఆదేశించారు. గుంటూరు ఐటీసీ హోటల్‌లో సోమవారం ప్రారంభమయ్యే సదస్సు వేదికను ఆయన ఆదివారం జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ కింద వెంగళాయపాలెంలో నిర్మిస్తున్న ఊట చెరువు పనులను, లయోలా పాఠశాల ఆవరణలో జరిగే సభ ఏర్పాట్లను కూడా ఆయన పరిశీలించారు. ఆయా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరి నిఖిల్‌కడే, వాటర్‌షెడ్ విభాగం సంచాలకుడు వైవీకే షణ్ముఖ కుమార్, అదనపు కమిషనర్ సీపీరెడ్డి, రాష్ట్ర సంచాలకులు షైలవరపు కృష్ణతేజ, గుంటూరు కలెక్టర్ తమీమ్‌అన్సారియా, జేసీ అశుతోష్‌శ్రీవాస్తవ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శంకర్ పాల్గొన్నారు.



శిలఫలాకాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం



చెరువు కట్ట వద్ద పనులు జరుగుతున్న దృశ్యం

అవగాహనా లోపంతోనే పక్షవాత మరణాలు

● మెదడును రక్షించడంలో గోల్డెన్ అవర్ కీలకం
● బీఫాస్ట్ పద్ధతిని విస్తృతంగా ప్రచారం చేయాలి
● ఐఎస్‌ఏ సింపోజియంలో వైద్యుల అభిప్రాయం

మంగళగిరి సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో అవగాహనా లోపం, ఆలస్యమైన వైద్యం కారణంగా పక్షవాతం వలన ప్రాణ నష్టం ఎక్కువగా సంభవిస్తుందని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో ఐఎస్ఏ సింపోజియం నిర్వహించారు. దేశంలో పెరుగుతున్న పక్షవాతం కేసుల దృష్ట్యా ప్రజలు తమ మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, క్రమం తప్పకుండా రక్తపోటును పర్యవేక్షించుకోవాలని, బీ ఫాస్ట్ అనే స్ట్రోక్ హెచ్చరిక సంకేతాల పట్ల అప్రమత్తంగా వుండాలని వైద్యులు సూచించారు. తొలుత ఐఎస్ఏ అధ్యక్షురాలు డాక్టర్ పీ విజయ జ్యోతిప్రజ్వలన చేసి సింపోజియంను ప్రారంభించారు. పలువురు వైద్యులు, ఐఎస్ఏ ప్రతినిధులు తమ అభిప్రాయాలను, అనుభవాలను వెల్లడించారు. దేశంలో ప్రతియేటా 18లక్షల మంది పక్షవాతం బారిన పడుతున్నారని చెప్పా రు. అధిక రక్తపోటు, మధుమేహం, ఒత్తిడి, ధూమపానం, అధిక బరువు వంటి కారణాలతో యువతలో కూడా ఈ తరహా కేసులు పెరుగుతున్నాయన్నారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ పక్షవాతం మొదలైన నాలుగున్నర గంటల (గోల్డెన్ అవర్) లోపు ఆసుపత్రికి చేరుకోవడం ద్వారా మెదడును రక్షించవచ్చని, దీర్ఘకాలిక వైకల్యాన్ని నిరోధించవచ్చని చెప్పారు. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఎస్‌ఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయ

ఈ సింపోజియంలో ఐఎస్ఏ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ సుశీల్ శర్మ, ఎయిమ్స్ విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ దీప్తి వేపకొమ్మ, పరిపాలనా విభాగం డిప్యూటీ డైరెక్టర్ కల్నల్ శశికాంత్ తుమ్మా, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ డాక్టర్ ముత్తు వెంకటాచలం, ఎమర్జెన్సీ వైద్యులు, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, గుంటూరు జీజీహెచ్, పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు. గ్రామీణ స్థాయిలో స్ట్రోక్ కేర్ మార్గదర్శకాల అభివృద్ధిపై చర్చించారు.

ఘనంగా ముగిసిన బాలోత్సవ్

● ప్రేక్షకులను ఉర్రూతలూగించిన జానపద నృత్యాలు
● తెలుగు కళలకు అద్దం పట్టేలా బాలల ప్రదర్శనలు
● విజేతలకు బహుమతుల అందజేత











పెదకాకాని, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (వీవీఐటీ)లో మూడురోజులపాటు వైభవంగా నిర్వహించిన బాలోత్సవ్-2025 వేడుకలు ఆదివారం ఘనం గా ముగిశాయి. పోటీల్లో దేశవ్యాప్తంగా వందలాది పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొనగా.. దాదాపు 25వేల మంది ప్రేక్షకులు బాలల ప్రదర్శనలు చూసేందుకు హాజరయ్యారు. మూడోరోజు విచిత్ర వేషధారణ, శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు జరిగాయి. 52 బృందాలు 3 వేదికల వద్ద చేసిన జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. విచిత్ర వేషధారణ పోటీలలో చిన్నారులు విశేషంగా ఆకర్షించారు. వారి ప్రదర్శనలు సాంప్రదాయాలకు అద్దంపట్టే లా ఉన్నాయి. మట్టిబొమ్మలు, కాగితపు చేతిబొమ్మల అంశాలలో చి న్నారులు ఆసక్తిగా ఆకృతులను రూపొందించారు. బాలోత్సవ్ విజయవంతం కావటంలో వీవీఐటీయూ శాక్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థుల కృషి అభినందనీయమని ప్రోచాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ అన్నారు. బాలోత్సవ్‌లో సంతోషంగా గడిపిన విద్యార్థులు వారి జీవిత లక్ష్యాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విజేతలైన విద్యార్థులకు వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, వీవీఐటీయూ వైస్ చాన్సలర్ రాంబాబు కొడాలి, రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ కె.గిరిబాబు బహుమతులు అందచేశారు.



మట్టితో బొమ్మలు చేస్తున్న చిన్నారులు

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం

● బాపట్లలో అఖిల పక్ష సదస్సులో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి

బాపట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందామని ఆం ధ్రప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి పిలుపునిచ్చారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో ఆదివారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ సదస్సు నిర్వహించారు. పీపీపీ విధానాన్ని విరమించి 590 జీవోను రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ డి మాండ్ చేసింది. ప్రముఖ వైద్యుడు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్రకన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగి న ఈ కార్యక్రమానికి మస్తాన్‌వలి ముఖ్యఅతిథి గా మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ప్రైవేట్ మెడికల్ మాఫియాను ప్రోత్సహిస్తూ 500 ఎకరాలలో నిర్మాణంలో ఉన్న 10 మెడికల్ కళాశాలలను, 10 ప్రభుత్వ ఆ సుపత్రులను కార్పోరేట్‌కు కట్టబెట్టాలనే కుట్ర చేస్తోందని ఆ రోపించారు. సీపీఎం కేంద్ర క మిటీ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ, విద్య, వైద్యరంగాలు సేవారంగాలుగా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పీపీపీ పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయటానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, దళిత బ హుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రప్రధానకార్యదర్శి గంటా అంజిబాబు, సీపీఐ కార్యవర్గసభ్యుడు పర్చూరి రాజేంద్రప్రసాద్, బాపట్ల జిల్లా కార్యదర్శి సింగరకొండ, గంగయ్య, మెడికల్ కళాశాలల కోకన్వీనర్ డాక్టర్ వసుంధర కుర్రా, ఎన్‌జే విద్యాసాగర్, మేదా శ్రీనివాసరావు, దర్శి విష్ణుశంకర్, డాక్టర్ తవ్వా సురేశ్ ప్రసంగించారు. తొలుత ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ సభ్యులు బాపట్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు.



ఐక్యత చాటుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ

హోరాహోరీగా ఎడ్లబండ లాగుడు పోటీలు

● సబ్ జూనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లా ఎడ్లజత ప్రథమం

దుర్గి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో ఉన్న శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆదివారం ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 4200 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానం కైవసం చేసుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన రోషన్‌బాబు ఎడ్లజత 4 వేల అడుగులు, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత కూడా 4వేల అడుగుల దూరం లాగి రెండు, మూడుస్థానాలను కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవ ఎడ్లజత 3800 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్ద గొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 3400 అడుగులతో ఐదోస్థానం, బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఉప్పుమాగులూరుకు చెందిన తనుబొత్తి రవిశంకర్‌రెడ్డి ఎడ్లజత 3357 అడుగులతో ఆరోస్థానం, బాపట్ల జిల్లా బాపట్ల మండలం బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్లజత 3140 అడుగులతో ఏడోస్థానంలో నిలిచాయి. పోటీలను తిలగించేందుకు రైతులు, పశుపోషకులు భారీగా తరలివచ్చారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గూడా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి వ్యవహరించగా పులి హరి, కొత్త వెంకటేశ్వర్లు, పులిబండ్ల పిచ్చయ్య, పెదనేడు గోపిలు పర్యవేక్షించారు. పోటీలను కూటమి నేతలు కటకం రామారావు, ఆకుల రామలక్ష్మయ్య, వంకమళ్ల కోటేశ్వరరావు, గుండాల వెంకటేశ్వర్లు, తోటకూర శ్రీనివాసరావు, వెలిదండి శ్రీనివాసరావులు ప్రారంభించారు. సోమవారం సేద్యం విభాగంలో పోటీలు జరగనున్నాయి.



ప్రథమస్థానం సాధించిన బాపట్ల జిల్లా ఎడ్లజత

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

భట్టిప్రోలు(కొల్లూరు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ వెనుక నుండి ఢీకొనడంతో వాహనదారుడు మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. ఆదివారం సాయంత్రం చెరుకుపల్లి మండలం, గూడవల్లికి చెందిన షేక్ అహ్మద్‌వలి(27) రేపల్లె నుండి ద్విచక్రవాహనంపై వస్తుండగా సూరేపల్లి వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య సువర్ణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కృష్ణానదిలో ఇద్దరు గల్లంతు

తుళ్లూరు(రాయపూడి), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలం లోని రాయపూడి కృష్ణానది లాంచీ రేవు వద్ద ఇద్దరు వర్కర్లు గల్లంతయ్యారు. పోలీసుల కథనం మేరకు.. శాఖమూరు గ్రామ పంచాయతీ పరిధిలో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు దగ్గర ఎన్‌సీసీ కంపెనీలో పనిచేస్తున్న నలుగురు వర్కర్లు నదిలో స్నానానికి దిగారు. ఇందులో ఎన్‌సీసీ స్టోర్‌లో పనిచేస్తున్న అమలాపురానికి చెందిన పవన్ (24), అకౌంటెంటుగా పనిచేస్తున్న గిద్దలూరుకు చెందిన దినేష్(23)లు నదిలో కొట్టుకుపోయారు. మణికంఠ, పవన్‌కళ్యాణ్ అనే ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కలగయ్య ఆధ్వర్యంలో గల్లంతైన వారికోసం పడవలతో గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

● లాంచీ స్టేషన్ ఆదాయం రూ.52వేలు



లాంచీలో కొండకు వెళ్తున్న పర్యాటకులు

విజయపురిసౌత్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కొండను ఆదివారం పర్యాటకులు భారీగా సందర్శించారు. కొండపై మ్యూజియంలో గల బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం వీక్షించారు. అనుపులోని యాంపీ థి యేటర్, అశ్వమేథ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి ఆలయం దర్శించారు. అ నంతరం ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. లాంచీల ద్వారా రూ.52వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ముఖ్యంగా మహిళల్లో అక్షరాస్యత చాలా తక్కువగా ఉండటంతో వారి అభివృద్ధిపై దృష్టి పెట్టి అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్‌వన్ సొసైటీ (ఉల్లాస్) కార్యక్రమాన్ని ప్రారంభించింది. పొదుపు మహిళలు, ఉపాధి కూలీల్లో నిరక్షరాస్యులకు, అలాగే చదువు మధ్యలో మానేసి అక్షరాలు పూర్తిగా మరచిపోయిన వారికి విద్యను అందించేందుకు ఈ కార్యక్రమం తోడ్పడనుంది.



శిక్షణ పొందుతున్న మహిళలు

నిరక్షరాస్యుల జీవితాల్లో ఉల్లాస్ వెలుగులు

● వయోజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి
● ప్రత్యేక కార్యక్రమానికి విద్యాశాఖ శ్రీకారం
● పొదుపు సంఘాల్లో మహిళలకు శిక్షణ
● పర్యవేక్షకులుగా వివిధ శాఖల అధికారులు

నరసరావుపేట రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యుల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం ఉల్లాస్ 2.0 కార్యక్రమంతో సిద్ధమయింది. ఈ కార్యక్రమం నిరక్షరాస్యులైన మహిళలకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలు నిర్వహించేలా తీర్చిదిద్దనుంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను, ఉపాధి హామీ పనులు చేసే కూలీలను, మధ్యలో బడి మానేసి అక్షరాలు మరచిపోయిన వారిని గ్రామస్థాయిలో గుర్తించి వారికి శిక్షణ ఇవ్వనున్నారు.

● 10 మంది సభ్యులకు ఒక వలంటీర్

స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి పొదుపు సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి వారికి ఇప్పటికే మండలస్థాయిలో శిక్షణ ఇచ్చి పాఠ్యాంశ సామగ్రిని అందజేశారు. ప్రతి గ్రామంలో పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన 10 మంది సభ్యులకు ఒక వలంటీర్ అక్షరాలతో పాటు సంతకాలు చేయడం నేర్పిస్తారు. వర్ణమాల, లెక్కలు, బ్యాంకు లావాదేవీల నిర్వహణ వంటి పలు అంశాలతో పాటు డిజిటల్ చెల్లింపులు మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు తదితర విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారు. గ్రామాల్లో వెసులుబాటు ఉన్న అంగన్‌వాడి కేంద్రాలు, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రదేశాల్లో తరగతులు సిద్ధం చేస్తున్నారు.

● నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యం

రాష్ట్రంలో 2029 నాటికి నూరు శాతం అక్షరాస్యతే లక్ష్యంగా ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని 28 మండలాల్లో 1,27,057 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి 10 మందికి 1 స్వచ్ఛంద మహిళా వలంటీర్‌ను ఎంపిక చేశారు. ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వలంటీర్లకు ఉల్లాస్ వాచకాలను కూడా పంపిణీ చేశారు.

● 12,757 వలంటీర్లతో బోధన

డీఆర్‌డీఏ పరిధిలో పొదుపులక్ష్మీ గ్రూపులలో 67,935 వేల మందిని, ఉపాధిహామీ పనులు చేసుకునే వారిలో 22,830 వేల మందిని, మునిసిపాలిటీ పరిధి మెప్మాలో 36,800 వేల మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వీరందరికి వలంటీర్లతో బోధన చేయించేలా ప్రణాళికలు చేశారు. ఇందులో 1,04,000 మంది మహిళలు ఉన్నారు. వీరందరికి 2026 మార్చి చివరి వరకు వలంటీర్లు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతరం వారికి ఎన్ఐవోఎస్ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారు. ఉల్లాస్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. వయోజన విద్య సజావుగా సాగేలా వీరు పర్యవేక్షించనున్నారు.

ప్రకాష్‌నగర్‌లో భారీ చోరీ

నరసరావుపేట లీగల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో భారీ చోరీ జరిగింది. మొదటి పట్టణ సీఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్‌కు చెందిన గడిపూడి సుబ్బారావు, భారతీదేవి దంపతులు గణపవరంలో నివసిస్తున్న వారి కుమార్తె వద్దకు గత మంగళవారం వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి ప్రధాన ద్వారం విరగగొట్టి ఉంది. తెరిచి ఇంట్లోకి వెళ్లి చూడగా 560 గ్రాముల బంగారం, రూ.25000 నగదు చోరీకి గురైనట్లు గమనించారు. ఈ మేరకు వారు మొదటి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ ఎం హనుమంతరావు, మొదటి పట్టణ సీఐ ఫిరోజ్ ఘటనా స్థలికి వచ్చి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

18 నుంచి తెలుగురాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు

కారంపూడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడిలో పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్లబండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ నాగవరపు రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు అన్నారు. ఆరు విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బహుమతులు అందిస్తారన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 43,500 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 52350 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 43,500 క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 3615, పశ్చిమడెల్టాకు 5009, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 9(ఆంధ్రజ్యో తి): నాగార్జునసాగర్ జలాశయం నీటిమ ట్టం ఆదివారం నాటికి 589.30 అడుగులు ఉంది. ఇది 309.95 టీఎంసీలకు సమానం. కుడికాల్వ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5438, ప్రధానజల విద్యుత్‌కేంద్రం ద్వారా 33,901, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,139 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 51,139 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0151 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా శనివారం అర్ధరాత్రి 12గంటల వరకు 1.0151 ఎంయూ ల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను 1.5 మీటర్లు, మరో 2 గేట్లను 1 మీటర్ మేర ఎత్తి పులిచింతలకు 31,101 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తున్నామన్నారు. టీఆర్‌సీ ద్వారా 8461 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా ఎగువన వున్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 34,185 క్యూ సెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు.

పులిచింతల..

అచ్చంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 43.84 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,110 క్యూసెక్కుల ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, మొత్తం 17వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

శిథిలావస్థలో మార్కెట్ యార్డు గోడౌన్లు

- దృష్టిసారించని అధికారులు
- మరమ్మతులు చేయాలని కోరుతున్న రైతులు

రేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె మార్కెట్ ఆవరణలో ఉన్న ధాన్యం ఆరబెట్టుకునే షెడ్లు రెండు, పది వేల బస్తాలు నిల్వచేసుకునే గోడౌన్ పూర్తిగా శిథిలమయ్యాయి. రేపల్లె మార్కెట్ యార్డు పరిధిలో రేపల్లె, చెరుకుపల్లి మండల పరిధిలోని గ్రామాలన్నీ ఈ మార్కెట్ యార్డు పరిధిలోనే ఉన్నాయి. రేపల్లె పట్టణం, మండలంలోని 28 గ్రామాలు, చెరుకుపల్లి మండలంలోని 18 పంచాయతీల్లో సుమారు


శ్లాబ్‌కు ఇనుప చువ్వలు బయటపడి మరమ్మతులకు నోచుకోని గోదాము


రేపల్లె మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబెట్టుకునే షెడ్డు దుస్థితి

70 వేల ఎకరాల వరి సాగు చేస్తున్నారు. సరైన గోడౌన్ లేక రైతులు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే చెరుకుపల్లి మండలంలోని గూడవల్లిలో ఉన్న మార్కెట్ యార్డు గోడౌన్‌లో అధిక వర్షానికి నీరుకిందకు దిగుతున్నాయి. దీంతో బస్తాలు నిల్వ చేసుకున్నా ఇబ్బంది పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ జనవరి నాటికి పంట చేతికొచ్చే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ధాన్యం నిల్వ చేసుకునే గోడౌన్‌లకు మరమ్మతులు చేయాలని, ధాన్యం ఆరబోసుకునే షెడ్లకు పూర్తి స్థాయిలో పైకప్పు వేయించాలని రైతులు కోరుతున్నారు.

కలెక్టరేట్‌లో నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం


కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పీజీఆర్ఎస్ అర్జీలపై అధికారులతో సమావేశం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యలపై, అర్జీలపై సమీక్ష నిర్వహించిన అనంతరం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలు నుంచి సమస్యల అర్జీలను స్వీకరించటం జరుగుతుందన్నారు. కలెక్టరేట్‌తోపాటు ప్రతి రెవెన్యూ డివిజన్, తహసీల్దార్ కార్యాలయాలలో కూడా అర్జీలు స్వీకరించటం జరుగుతుందన్నారు. అర్జీలు అందజేసిన వారివి ఇప్పటికీ పరిష్కారం కాకపోయిన, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవటానికి 1100కు కాల్ చేయాలన్నారు. అర్జీలను మీకోసం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, దీనిని సద్వినియోగం చేసుకొని సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- ప్యానల్ అడ్వకేట్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్


సదస్సులో మాట్లాడుతున్న ప్యానల్ అడ్వకేట్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్యానల్ అడ్వకేట్ దగ్గుమల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. జాతీయ లీగల్ సర్వీస్ అథారిటీ డే సందర్భంగా బాపట్ల మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఛైర్మన్, 6వ అదనపు జిల్లా జడ్జి కె.శ్యాంబాబు ఆదేశాల మేరకు ఆదివారం బీసీ వసతి గృహంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్యానల్ న్యాయవాది కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బలహీనవర్గాలకు, బాధితులకు, దివ్యాంగులకు, మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది భీమా లీలాకృష్ణ, హాస్టల్ వార్డెన్, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినూత్నంగా తెలుగు చిత్ర నిర్మాణం

- ప్రముఖ సినీ నిర్మాత పువ్వాడ ఏకాంబరేశ్వరరావు

బాపట్ల నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలుగు చలనచిత్ర రంగంలో ఒక వినూత్నమైన పద్ధతిలో ఆనాడు చిత్రాలను నిర్మించానని, తెలుగు ప్రేక్షకుల అదరాభిమానాలు పొందానని సుఖదుఃఖాలు, జగత్ కిలాడీలు, జగత్‌జట్టీ వంటి ఎన్నో చిత్రాలు నిర్మించిన ప్రముఖ నిర్మాత పువ్వాడ ఏకాంబరేశ్వరరావు అన్నారు. ఆదివారం జరిగిన తెలుగు రచయితల సన్మాన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కవితల పోటీల విజేతలకు ఏకాంబరేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సినీ నిర్మాత పువ్వాడ ఏకాంబరేశ్వరరావును సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, కోశాధికారి, ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రిమాల్యాద్రిరావు, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు శ్రీహరిరావు, జిల్లా అధ్యక్షులు జీవీ బ్రహ్మం, మన్నె శ్రీనివాసరావు, రచయిత వెంకుసనాతన, రచయిత ఎం.ఎల్.వి.ప్రసాద్, గ్రో సంస్థ అధినేత బందాబాబు, కవిత విశారద దీవి శ్రీనివాసమూర్తి, కామరాజు కాళీదాసు, దగ్గుమల్లి శామ్యూల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రచయిత ఆదంషఫిని అంజుమన్ కమిటీ అధ్యక్షులు రహీంజానీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి సుభాషిణి, రచయిత సాధిక్, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి రావూరి చంద్రశేఖరరావు, రామ్ మనోహర్ లోహియా పాల్గొన్నారు.


ప్రముఖ సినీనిర్మాత పువ్వాడ ఏకాంబరేశ్వరరావును సన్మానిస్తున్న రచయితలు, సీనియర్ సిటిజన్స్ తదితరులు

పద్మశాలీలు ఐక్యంగా ఉండాలి

- ఏఆర్ డీఎస్పీ ప్రగడ విజయసారథి

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీయులంతా ఐక్యంగా ఉండాలని బాపట్ల ఏఆర్‌డీఎస్పీ ప్రగడ విజయసారథి తెలిపారు. బాపట్ల- కర్లపాలెం పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలోని పద్మశాలియ సేవాసంఘం భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏఆర్ డీఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలందర్నీ బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమసాధికారిత అధికారిణి గంజి వీరశివలీల, ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ కార్యంపూడి వెంకటేశ్వర్లు, చీరాల మాజీ మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, గుద్దంటి వెంకట నాగేశ్వరరావు, చిట్టిల హరికృష్ణ, పద్మశాలీయ సేవా సంఘం అధ్యక్షుడు పోసా ఏడుకొండలు, గౌరవాధ్యక్షులు నారాయణం పాపరావు, ఉపాధ్యక్షుడు పడవల నరేంద్ర, కోశాధికారి భట్టు రవీంద్రబాబు, కార్యదర్శి ఆకురాతి రుక్మాంగధ రాజారావు, పద్మశాలీయ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వావిలాల సాయిబాబు, పద్మశాలీయ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకురాతి సత్యనారాయణ, బిట్రా గోకుల్ చంద్, వాసి చక్రధర్, గోలిరవికాంత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం సామూహిక వనభోజనాలు చేశారు. పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్ డీఎస్పీ ప్రగడ విజయసారథి

శ్రీబగళాముఖి అమ్మ వారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారికి కార్తిక ఆదివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

శివకేశవమూర్తి అలంకరణలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామపంచాయతీలోని శ్రీనివాసపురంలో ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి ఆదివారం కార్తిక దీపోత్సవం సందర్భంగా శివకేశవమూర్తి అలంకరణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు బృందావనం గోపిచంద్ తెలిపారు. కార్తిక బహుళపంచమి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి కోటిదీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి 40 కిలోల కర్పూరం వెలిగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి మంగళశాసనాలు పొందారు.

ఘనంగా కొడాలి గోపాలరావు శతజయంతి

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత, నటులు కొడాలి గోపాలరావు శతజయంతి వేడుకలను వెదుళ్ళపల్లి వివేకాసర్వీస్ సొసైటీ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. సాహిత్య అకాడమి, వివేకా సర్వీస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ధృతి సాహిత్య సంస్థ అధ్యక్షులు, న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. బెంగుళూరు సాహిత్య అకాడమి ప్రోగ్రామ్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రాజు మాట్లాడుతూ గోపాలరావు రచనలు, నాటకాలను, కళాకారుల ప్రతిభను ప్రతిఒక్కరికి తెలియజేసేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళికృష్ణ, ఆకాశవాణి రేడియో మాజీ డైరెక్టర్ డాక్టర్ ముంజులూరి కృష్ణకుమారి, రచయిత ఎన్‌వీ కృష్ణారావు, ఎల్‌వీ నాగభూషణరావు, సుబ్రహ్మణ్యం, డాక్టర్ శరత్, గురజాల శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, తిమ్మనశ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహిత్య పుస్తకాలను అందజేశారు.

అక్టోబరు విప్లవం కమ్యూనిస్ట్ ఆలోచనలకు బీజం

- సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచవ్యాప్తంగా అక్టోబరు విప్లవం కమ్యూనిస్ట్ ఆలోచనలకు బీజం వేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. మానవాళి విముక్తికి మార్గదర్శకమైన అక్టోబరు విప్లవం కార్యక్రమంపై పట్టణంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి గంగయ్య మాట్లాడుతూ కార్మిక ఉద్యమాలు, వలస వ్యతిరేకపోరాటాలు, సామ్యవాద సిద్ధాంతాలు ఈ విప్లవం నుండి ప్రేరణ పొందాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.శరత్, కార్మికులు పాల్గొన్నారు.

వివేకా హత్య వెనుక మూలవిరాట్‌ను బట్టబయలు చేయాలి : కొల్లా

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ వివేకానందరెడ్డి హత్య వెనుక ఉన్న మూలవిరాట్‌ను బట్టబయలు చేయాలని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి కోరారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ వివేకానందరెడ్డి కుమార్తె, అల్లుడు, సీబీఐ అధికారి రామసింగ్‌పై కొందరు పోలీసుల కుట్రతో కేసు పెట్టటం వెనుక ఎవరికి ప్రయోజనాలు ఉన్నాయో ప్రతి ఒక్కరికి అర్థమౌతుందన్నారు. సీబీఐ అధికారి రామసింగ్‌పై రాష్ట్ర పోలీసులు కేసు పెట్టి బెదిరింపులకు పాల్పడే దౌర్జన్య చర్యలు వెనుక ఉన్న మూలవిరాట్ ఎవరో బట్టబయలు చేయాలని కొల్లా అన్నారు.

బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే వారిని అరికట్టాలి

- ఫోరం ఫర్ ఆర్‌టీఐ జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ సంస్థలలో సమాచార హక్కు చట్టం, హ్యూమన్ రైట్స్ ద్వారా అవినీతికి పాల్పడే వారిని అరికట్టాలని ఫోరం ఫర్ ఆర్‌టీఐ జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్రమోహన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బాపట్ల ఎన్జీవో హోమ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు మద్దిబోయిన అమృతరాజు అధ్యక్షత వహించగా చంద్రమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి విచ్చవిడిగా పెరిగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవరకొండ రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బ్రహ్మారెడ్డి, సలీం, బడుగు కిషోర్, యెషయ తదితరులు పాల్గొన్నారు.

గూడవల్లి బాడవ గుడిలో ఘనంగా వనసమారాధన

చెరుకుపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గూడవల్లిలోని బాడవలో ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వనసమారాధన ఘనంగా జరిగింది. ఈవనసమారాధనకు వేలాది మంది భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని పుట్టలో పాలు పోసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు. అన్నప్రసాదాన్ని 3 వేల మంది భక్తులు స్వీకరించారని ఆలయ ధర్మకర్త గడ్డిపాటి రామ్మోహన్‌రావు తెలిపారు. 11 సంవత్సరాల నుంచి భక్తుల సహాయ సహకారాలతో ఈవనసమారాధన జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

జంపనిలో అయ్యప్ప గ్రామ పూజ

వేమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని రామేశ్వరాలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి భజన, సేవా సంఘం వారు సంయుక్తంగా అయ్యప్ప గ్రామ పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కేరళ సంప్రదాయ ప్రకారం అరటి బొత్తలతో అతి సుందరంగా ఐదు మండపాలు ఏర్పాటు చేసి వాటిలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, లక్ష్మీదేవి, ఈశ్వరుని చిత్రపటాలను ఆవిష్కరించారు. కేరళ సంప్రదాయ ప్రకారం గురుస్వామి తంత్రసార ఆగమ విధానంలో విశేష పూజలు జరిపారు. అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పంచలోహ విగ్రహానికి పంచామృతాభిషేకం జరిపారు. కార్యక్రమం అనంతరం భిక్ష కార్యక్రమం నిర్వహించారు.


వెదుళ్ళపల్లి సెంటర్ వద్ద విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

రోడ్డుప్రమాదాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

- బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

బాపట్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు అన్నారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెదుళ్ళపల్లి సెంటర్‌లో, పరిధిలోని బ్లాక్ స్పాట్స్ ప్రాంతాలను సందర్శించి రోడ్డు ప్రమాదాలు తగ్గించే దిశగా సూచనలు చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలోని గడియార స్తంభంసెంటర్‌లో...

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అతివేగం ప్రమాదకరమని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ఆదివారం బాపట్లలోని గడియార స్తంభంసెంటర్ వద్ద కార్తికమాసం పురస్కరించుకొని సూర్యలంకబీచ్‌కి వస్తున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదన్నారు. రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు హెల్మెట్ ధరించకపోవటం వల్ల మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించటం వల్ల కొద్దిపాటి గాయాలతో ప్రాణాలు కాపాడుకోవచ్చు అని తెలిపారు.

చందోలు-బాపట్ల హైవేపై ...

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ తెలిపారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు రూరల్ సర్కిల్ సీఐ బి.హరికృష్ణ ఆధ్వర్యంలో చందోలు ఎస్సై మర్రి వెంకటశివకుమార్ తనసిబ్బందితో కలిసి ఆదివారం చందోలు-బాపట్ల హైవేపై వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనదారులు ధ్రువీకరణపత్రాలు తప్పనిసరిగా తమ వెంట ఉంచుకోవాలని, హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకపోతే అపరాధ రుసుం విధించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలులోని పోలీస్‌స్టేషన్ వద్ద...

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు హెల్మెట్ వినియోగించడం వల్ల ప్రాణాలు పదిలంగా ఉంటాయని ఎస్ఐ ఎం.శివయ్య అన్నారు. ఆదివారం భట్టిప్రోలులోని పోలీస్‌స్టేషన్ వద్ద హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహన దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు జరిగిన రోడ్డు ప్రమాదాలు గురించి వివరిస్తూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు బలమైన గాయాలై ప్రాణాలు విడిచినట్లు వాహనదారులకు వివరించారు. వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలతో పాటు హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల బారిన పడిన ప్రాణాలు కాపాడుకోవచ్చునని చెప్పారు. హెల్మెట్‌లు ధరించి ద్విచక్ర వాహనాలతో ఎస్ఐ ర్యాలీ నిర్వహించారు.

కర్లపాలెం సెంటర్‌లో...

కర్లపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించి పరిమిత వేగంతో వాహనాలు నడపాలని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపారు. కర్లపాలెం సెంటర్‌లో జాతీయ రహదారిపై వాహనదారులకు రోడ్డు నిబంధనలపై ఆదివారం ఎస్ఐ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన లైసెన్స్‌లన్నీ వెంట ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని చెప్పారు. వివిధ అంశాలపై వాహనదారులకు ఎస్ఐ రవీంద్ర అవగాహన కల్పించారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- రాంపల్లి జగన్నాథశాస్త్రి

చెరుకుపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బీజేపీని పటిష్టం చేసి రాబోయే స్థానిక ఎన్నికలకు సంసిద్ధం కావాలని జిల్లా సీనియర్ నాయకుడు రాంపల్లి జగన్నాథశాస్త్రి అన్నారు. మండల ప్రవాస్ యోజన, ఆత్మనిర్భర్ భారత్ సమావేశం మండల కన్వీనర్ గౌతమ్‌సాయిరాంశర్మ అధ్యక్షతన ఆదివారం కనగాలలో జరిగింది. కార్యక్రమం ఇన్‌చార్జ్ అంకమ్మ శివనాగేశ్వరరావు, జిల్లా సీనియర్ నాయకుడు రాంపల్లి జగన్నాథశాస్త్రి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత విషయాలు, ఆత్మనిర్భర్‌భారత్ గురించి, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని, తద్వారా దేశాన్ని ఆర్థికంగా పరిపుష్టి చేయాలన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన వారితో స్వదేశీని ప్రోత్సహిస్తానని, స్వదేశీనే ఉపయోగిస్తానని, గ్రామంలో స్టిక్కర్లు అతికించి, కరపత్రాలు పంచి, అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, టి.నాగేంద్రకుమార్, శ్రీరామచంద్రప్రభు, బొర్రు శివపోతురాజు, ఆలా గంగరాజు, కందుల శివశంకర్, చంద్రబాబు, కోటి, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

- అనగాని శివప్రసాద్


నల్లూరుపాలెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలోని గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని నల్లూరుపాలెం గ్రామంలో సీసీ రహదారులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మున్సిపాల్టీ, నాలుగు మండలాల్లో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి ప్రతిపంచాయతీలో రూ.40 లక్షలు నిధులతో రహదారులను నిర్మించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టిసారించి రహదారులు, రోడ్లు, తాగునీటి సమస్య, శ్మశానాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రావిపాటి శ్రీధర్, తాతా ఏడుకొండలు, పంతాని సాయికుమార్, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

తురుమెళ్లలో గ్రామ సామాజికి నీటిశుద్ధి కేంద్రం ప్రారంభం

అమృతలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో అందరికి సురక్షితమైన తాగునీరు అందించడం తమ లక్ష్యం అని కమ్యూనిటీ ప్యూర్ వాటర్ ఆర్గనైజేషన్ సీఈవో కె.లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని తురుమెళ్ళలో గ్రామ సామాజిక నీటి శుద్ధి కేంద్రాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ తమ సంస్థ గత 8 సంవత్సరాలుగా 5 రాష్ట్రాల్లో ఇప్పటికి వరకు 500 ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కూడా తమ ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. స్మార్ట్ కార్డుల ద్వారా మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మంచినీటి పంపిణీని స్మార్ట్ కార్డు ద్వారా పర్వతనేని విష్ణుమోహన్‌చౌదరి, సుశీలలు చేతులమీదగా ప్రారంభించారు. కార్యక్రమంలో కొసరాజు విజయకుమార్, పీఏసీఎస్ కొసరాజు దేవకుమార్, కిరణ్, అంకమ్మరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


స్మార్ట్ కార్డుతో మంచినీటి పంపిణీ ప్రారంభిస్తున్న పర్వతనేని విష్ణుమోహన్ చౌదరి తదితరులు

వైభవంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

రేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తిక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది మంది దంపతులు సత్యన్నారాయణస్వామి వ్రతాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆరు వేల మందికి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, ఆగస్త్య, దేవగిరి రవి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా లక్ష బిల్వార్చన


ప్రత్యేక అలంకరణలో ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి

రేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇసుకపల్లిలోని భ్రమరాంబసమేత చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమం వైభవంగా అర్చకుడు శివరామ కృష్ణప్రసాద్, పవన్‌కుమార్ నిర్వహించారు. తొలుత స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి వివిధ రకాల హారతులు ఇచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ నిర్వహణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు నిర్వహించారు.

అనంత భోగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కొల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనంత భోగేశ్వర స్వామి వారికి లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పంచమి ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని కొల్లూరులో ఉన్న గంగా పార్వతీ సమేత అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వ దళాలతో స్వామి వారికి అర్చన చేశారు. స్వామి వారి జన్మనక్షత్రం ఆరుద్ర కావడంతో విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు కొమ్మూరి వెంకటశివప్రసాద్, గాడేపల్లి శివశర్మ అన్నారు. పూజాది కార్యక్రమాలను పార్వతీ అమ్మవారి దేవస్థాన బ్రాహ్మణ సంఘ సభ్యులు పర్యవేక్షించారు.


అనంత భోగేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

14న కబడ్డీ పోటీలు ప్రారంభం

కర్లపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కర్లపాలెం పంచాయతీ పరిధిలో ఎంపీ రాజుపాలెంలో బాపట్ల, రేపల్లె నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు ఈనెల 14 నుంచి ప్రారంభమౌతాయని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనదలిచిన వారు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి టీమ్‌లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు పిట్ల బాలాజిరెడ్డి 6281569921, శవనం అశోక్‌రెడ్డి 7680905728ను సంప్రదించాలన్నారు.

అవీ..ఇవీ..

రాకపోకల పునరుద్ధరణకు చర్యలు



పేరాయపాలెం వద్ద గండికి గ్రావెల్ తోలుతున్న టిప్పర్

అద్దంకి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరాయపాలెం వద్ద మొంథా తుఫాన్‌కు రోడ్డుకు పడ్డ గండి పూడ్చి రాకపోకల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టగా పెద్దగండి ఉండడంతో టిప్పర్లతో గ్రావెల్ తరలించి రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. రెండు, మూడు రోజులలో రాకపోకలు పునరుద్ధరించనున్నారు.

అన్నదానానికి విరాళం

అద్దంకి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అన్నదానానికి ఆదివారం దాతలు విరాళం అందజేశారు. శింగరకొండపాలేనికి చెందిన ఎర్రిబోయిన బాబురావు రూ.10,116, అద్దంకికి చెందిన బ్యాంక్ ఉద్యోగి కేవీ. సుబ్బారెడ్డి రూ.10,116లను అన్నదానానికి ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావుకు విరాళం అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతలను సత్కరించారు.

బ్రహ్మంగారి కాలజ్ఞానంలో అద్దంకి ప్రస్తావన

● డాక్టర్ చింతాడ బ్రహ్మానందరావు



చింతాడ బ్రహ్మానందరావును సన్మానిస్తున్న అద్దంకి నేతలు

అద్దంకి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి రాసిన కాలజ్ఞానంలో అద్దంకి గురించి ప్రస్తావన ఉందని రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు, సనారి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆశ్రమ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చింతాడ బ్రహ్మా నందరావు అన్నారు. ఆది వారం అద్దంకిలోని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యా లయంలో డాక్టర్ బ్రహ్మా నందరావును ఘనంగా సన్మానించారు. హైందవ సనాతన ధర్మాన్ని పరిరక్షిం చేందుకు, వైభవం తీసుకువచ్చేందుకు అందరు కృషి చేయాలన్నారు. కాలజ్ఞానంలో అద్దంకి గురించి ఉన్న పలు విషయా లను వివరించారు. కార్య క్రమంలో చెన్నుపల్లి శ్రీనివాసాచారి, కొండపర్తి రాజశేఖర్, పొన్నపల్లి బ్రహ్మా నందం, రావూరి కోటేశ్వరరావు, కంచర్ల విష్ణువర్ధనాచారి, ఏలూరి వీరబ్రహ్మేంద్ర తదిరులు

చీపురు పుల్లల కోసం వెళ్లిన వృద్ధుడి మృతి

బల్లికురవ, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): చీపురు పుల్లల కోసం కొండ ప్రాంతానికి వెళ్లిన వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని సూరేపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన వృద్ధుడు దొడ్డా రామాంజనేయులు(65) తమ గ్రామానికి సమీపంలోని కొండకు వెళ్లి చీపురు పుల్లలు తెచ్చి చీపుర్లు కట్టి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రోజు మాదిరిగానే కొండకు వెళ్లాడు. అక్కడ గొంతు ఎండి అపస్మారక స్థితి చేరాడు. గొర్రెల కాపరులు చూసి 108కి సమాచారం అందించగా వారు వచ్చే సమాయానికి వృద్ధుడు మృతి చెందాడు.

రోటరీ క్లబ్ సభ్యుల కుటుంబాల సమావేశం

అద్దంకి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ వారు ముండ్లమూరు మండలం శంకరాపురం వద్ద ఉన్న సయ్యద్ హాజీ మౌలాలికి ఫామ్ హౌస్ వద్ద కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు రకాల పోటీలు నిర్వహించారు. లక్కీ డిప్‌లు తీసి బహుమతులను అందజేశారు. అనంతరం రోటరీ క్లబ్ చేస్తున్న సేవల గురించి చర్చించారు. కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ బాచిన శివ ధర పూర్ణచంద్రరావు, వీరవల్లి రుద్రయ్య, కాకాని రాధాకృష్ణమూర్తి, టీవీ కృష్ణారెడ్డి, గంగాధర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన చైర్మన్ చుండూరి మురళీసుధాకర్, సందిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గాజుపాలెం పీహెచ్‌సీకి కాయకల్ప అవార్డు

అద్దంకి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాజుపాలెం అర్బన్ పీహెచ్‌సీ కాయకల్ప అవార్డుకు ఎంపికైందని, వైద్యులు గొట్టిపాటి జయసింహా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 పీహెచ్‌సీలను ఈ అవార్డులకు ఎంపిక చేయగా అందులో గాజుపాలెం పీహెచ్‌సీ ఉందని అయన తెలిపారు.

మత్స్యకారులకు నిత్యావసరాల అందజేత

అద్దంకి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన 20 మత్స్యకారుల కుటుంబాలకు ఆదివారం నిత్యావసర వస్తువులను నియోజకవర్గ ఐ టీడీపీ అధ్యక్షులు షేక్ కరిముల్లా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం మొంథా తుపానుతో దెబ్బతిన్న మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోనేందుకు నిత్యావసర వస్తువులను అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని మత్స్యకారులు సద్వినియెగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశోక్, ఆదినారాయణ, మాధ్యుస్, ప్రసాద్, బలరామిరెడ్డి, అశీర్వాదం, ప్రాన్సిస్ పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

● మానవత్వం చాటుకున్న పోలీసులు

పర్చూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనాథ వృద్ధునికి అంత్యక్రియలు నిర్వహించి పోలీసులు మానవత్వా న్ని చాటుకున్నారు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామాని కి చెందిన చీరాల శ్రీని వాసరావు అనే వృద్ధుడు అనారోగ్యంతో పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో ఆది వారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పర్చూరు ఎస్సై జీవీ.చౌదరి స్పందించారు. మేమున్నాం అంటూ తమ సిబ్బంది షేక్.నాగూర్, రవికుమార్ సాయంతో ముందుకు వచ్చి పర్చూరు హిందూశ్మశాన వాటికలో పర్చూరు పంచాయతీ సిబ్బందితో అంత్యక్రియలు నిర్వహించారు.

అర్ధరాత్రి నిలిచిపోయిన ట్రావెల్స్ బస్

● ఐదు గంటల పాటు ప్రయాణికుల నరకయాతన
● ఆందోళనకు దిగిన ప్రయాణికులు



ఏల్చూరు వద్ద నిలిచిన బస్సు

ఏల్చూరు (అద్దంకి), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్ సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. స్థానికుల కథనం మేరకు తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత 2.50 గంటల సమయంలో సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్దకు వచ్చింది. ఆ సమయంలో బస్సులో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిలిచిపోయింది. ప్రయాణికులు డ్రైవర్‌ను ప్రశ్నించడంతో బస్ మరమ్మతులకు గురైందని, మరో బస్‌లో పంపిస్తామని చెప్పారు. ఆదివారం ఉదయం 8 గంటల వరకు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ఆందోళనకు దిగారు. ఆ సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న సంతమాగు లూరు ఏఎస్సై శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకొని ట్రావెల్స్ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రయాణికులకు చార్జీ డబ్బులు వెనక్కు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని వెళ్లిపోయారు. ఐదుగంటల పాటు వేచి ఉండడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

టెన్నికాయిట్‌లో బాలబాలికల సత్తా

విజయవంతంగా ముగిసిన ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ విభాగం పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూల్లో రెండురోజులుగా జరుగుతున్న 42వ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ టెన్ని కాయిట్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి సుమారు 200 మంది బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాకారులకు భోజన, ఇతర సౌకర్యాలను నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిన్నవయసులో దూరాభారం ఆలోచించకుండా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. హోరాహోరీగా చిన్నారులు పోటీల్లో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. పోటీల్లో ఒకరిద్దరు క్రీడాకారుల వైఫల్యాలను సున్నితంగా వివరించి పోటీ తత్వాన్ని తెలియజేశారు. పోటీల్లో బాలుర విభాగంలో వెస్ట్ గోదావరికి చెందిన పవన్ ప్రథమ స్థానం దక్కించుకోగా, రెండవ బహుమతి విజయనగరానికి చెందిన శివ శంకరప్రసాద్, మూడవ స్థానంలో కాకినాడకు చెందిన సత్యనారాయణ ఉన్నారు. అలాగే బాలికల విభాగంలో అనంతపూర్‌కు చెందిన జి. సుప్రియ ప్రథమస్థానంతో సత్తాచాటింది. రెండవ స్థానంలో అనంతపూర్‌కు చెందిన కే.జ్యోతిక, మూడవ బ[illegible]తి విజయనగరానికి చెందిన ఇందు సాధించింది. దీంతో క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

చీరాల : తెలుగు సంవత్సరంలో కార్తీక మాసం అత్యంత పవిత్రమైనదని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. పేరాల ముత్యాలమ్మపేటలో యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాసంలో సముద్రస్నానాలను పుణ్యకార్యంగా భక్తులు భావిస్తారన్నారు. నిర్వాహకుల ద్వారా ప్రత్యేక పూజలు, వన సమారాధనలో పాల్గొన్నారు. అలాగే రామాపురంలో నూతన రిసార్ట్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పర్యాటక రంగాభివృద్ధికి రిసార్ట్స్ నిర్వహణ అవసరమన్నారు. అలాగే పచ్చమొగిలిలో నిర్వహిస్తున్న యాదవ కార్తీక వన సమారాధనలో సీఐ సుబ్బారావుతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, యాదవ సామాజిక వర్గం ప్రముఖులు హాజరయ్యారు.

దేశానికి ప్రాతినిథ్యం వహించాలన్నదే లక్ష్యం



ఇప్పటికే మూడుసార్లు రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించాను. తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వ రమ్మ వ్యవసాయకూలీలు. నా కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. నేను దేశానికి గర్వకారణంలా నిలుస్తాను.

ఎం పవన్‌కుమార్, వెస్ట్ గోదావరి

అంతర్జాతీయ క్రీడాకారిణిలా ఎదుగుతా



అమ్మా, నాన్న రామాంజినమ్మ, వెంకటేశ్వర్లు రోజు వారీ కూలీలు. నేను ఉన్నతంగా ఎదగాలని నన్ను నిరంతరం ప్రోత్సహిస్తున్నారు. చీరాల్లో నిర్వాహకులు చక్కని సౌకర్యాలు కల్పించారు. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ క్రీడాకారిణిలా ఎదుగుతాను.

- జి సుప్రియ, అనంతపూర్

క్రీడల్లో ఔత్సాహికులకు ప్రోత్సాహం



నగదు సాయం చేస్తున్న ప్రతినిధులు

చీరాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడలపట్ల ఔత్సాహికులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అందుకుంటారని వాకర్స్ అసోసియేషన్- 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ పెద్ది శివరామక ప్రసాద్, ట్రెజరర్ లఘువరపు సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తైక్వాండో పోటీల్లో ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి, ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2 వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీల్లో ఆడనున్న కేజీఎం విద్యార్థిని షేక్ తాహిరాకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అసోసియేషన్ సేవలకు సంబంధించి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, నారాయణమూర్తి, శివరామ ప్రసాద్, వెంకటసుబ్బారావు, బాబాజీ రావు, సుభాషిణీ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస సత్యనారాయణస్వామి వ్రతాలు



వ్రతాలు నిర్వహిస్తున్న అర్చకుడు

చినగంజాం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగా పార్వతి సమేత చిదంబరేశ్వర స్వామి దేవస్థానం ప్రాగంణంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించి, వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. దేవస్థాన ప్రాంగణంలో భక్తులకు కార్తీకమాస వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీసభ్యులు, ఆలయ సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాలను పరిశీలించిన జేసీ



నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న జేసీ భావన

చినగంజాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినగంజాం కొమ్మమూరు కాలువ ఆయకట్టు పరిధిలో, కడవకుదురు ప్రాంతంలో నీట మునిగిన వరి పొలాలను జిల్లా జాయింట్ కలెక్టర్ భావన ఆదివారం పరిశీలించారు. మొంథా తుఫాన్ కారణంగా వరద నీటికి మునిగిన వరి పొలాలను జేసీ పరిశీలించి, ఆయా ప్రాంతాల రైతులతో మాట్లాడారు. వరదనీరు ఎలా వచ్చింది, వరదనీటిలో పంటలు ఎన్ని రోజులు ఉన్నాయని ఆమె రైతులను అడిగారు. వరదనీరు సక్రమంగా పోయే మార్గం లేక వారం రోజులు వరద నీటిలో ఉన్నాయని, పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. ఇప్పటి వరకు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. మరో పది వేలు ఖర్చుపెడితే పంట ఇంటికి వచ్చేదని రైతులు రైతులు దొడ్డక బాలకృష్ణ, శింగంశెట్టి శివన్నారాయణ, శేషు, మందారపు నాగేశ్వరరావు, నక్కల పాపయ్య, పాలెం సుబ్బారావు, తోటకూర నాగరాజు, వడ్లమూడి రామకృష్ణ, .అంజిబాబులు జేసీకి వివరించారు. కొమ్మమూరు కాలువకు మరల నీరు ఎప్పుడు విడుదల చేస్తారని రైతులు జేసీని అడిగారు. నీటిపారు దల శాఖ వారిని అడిగి తెలియజేస్తానని ఆమె రైతులకు తెలిపారు. వనద నీటిలో ఎన్ని రోజులు ఉంటే పంట దెబ్బతింటుందని, ఎకరాకు ఎన్ని బస్తాలు పండుతాయని ఆమె వ్యవసాయాధికారులను అడిగారు. కార్య క్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు, చీరాల ఏడీఏ రత్నకుమారి, చీరాల ఉద్యానవన శాఖాధికారి అలేఖ్య, ఏవో చంద్రశేఖర్, వీఆర్వో కే.నాగేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక రుద్రాభిషేకం

పేరాల(చీరాల), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేరాల గోలి సదాశివ కల్యాణ మండపంలో ఆదివారం జంగమ సంక్షేమ సంఘం కార్తీకమాస సామూహిక రుద్రాభిషేకములు ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో విశేష పూజలు నిర్వహించారు. పుణ్యస్నానాలు ఆచరించి, శివ సమారాధన చేశారు. అలాగే ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో చేజర్ల శ్రీను, షణ్ముఖీ, బాల భాస్కర్, కిషోర్, మహేష్, సురేష్, రాజశేఖర్, శ్రీను, మల్లేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె మృతదేహం కోసం ఎదురుచూపులు



తండ్రి రామకృష్ణకు నగదు అందజేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

కారంచేడు (పర్చూరు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని టెక్సాస్‌లో మృతి చెందిన కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి(రాజీ) మృతదేహం కోసం కుటుంబ సభ్యులు నిరీక్షిస్తున్నారు. ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లి ఇలా అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె ఇలా అకాల మృతిచెందడంతో తల్లిదండ్రులు తీవ్ర వేదనకు గురయ్యారు. మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. కుమార్తె కడచూపైనా దక్కుతుందన్న ఆశతో గుండెలు అవిసేలా రోదిస్తున్నారు. అయితే రాజ్యలక్ష్మి మృతదేహం గురువారం నాటికి స్వగ్రామం చేరుకుంటుందని బంధువులు తెలిపారు.

అకాల మృతి చెందిన కారంచేడు గ్రామానికి చెందిన యార్లగడ్డ రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులకు స్థానిక సిద్ధార్థ వృద్ధ శరణాలయ ప్రతినిధులు ఆదివారం రూ.50వేల ఆర్థికసాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. తల్లిదండ్రులు, యార్లగడ్డ రామకృష్ణ, వాణీ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు దగ్గుబాటి నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, చాగంటి లక్ష్మీన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంగళాయపాలేనికి.. సరోవరం

(5వ పేజీ తరువాయి)

పరిమితమైంది. దీంతో పశువుల సంచారంతో చెరువు చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో రూపం కోల్పోయింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం చెరువుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. చెరువు చుట్టూ ఖాళీ స్థలంతో పాటు.. విశాలంగా ఉండటంతో జాతీయస్థాయిలో ఎంపిక చేసి, అమృత సరోవర్ అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు చుట్టూ కొబ్బరి చెట్లు, చెరువులో చేపల పెంపకానికి కూడా చర్యలు చేపట్టారు. తద్వారా ఆదాయం కూడా ఆర్జించేలా చెరువును అభివృద్ధి చేశారు. కొబ్బరి చెట్ల ద్వారా ఏడాదికి రూ.3 లక్షలు, చేపల పెంపకం ద్వారా రూ.2 లక్షలు పంచాయతీకి సమకూరుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలుకు పాలకులు, అధికారులు ఆలోచన చేస్తున్నారు.

రేపు పరిశీలన.. సభ

రెండు రోజుల వాటర్‌షెడ్ సదస్సు గుంటూరులో సోమవారం ప్రారంభమవుతుంది. కాగా చెరువును పరిశీలించేందుకు మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ రానున్నారు. ఆయనతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిదులు కూడా రానున్నారు. ఆ తర్వాత వెంగళాయపాలెంలోని నల్లపాడు, లయోలా పాఠశాలలో వాటర్ షెడ్ మహోత్సవం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. చెరువుతో పాటు వెంగళాయపాలెం గ్రామంలో డివైడర్‌కు రంగులతో పాటు రోడ్డు మరమ్మతులు చేశారు. లయోలా పాఠశాలలో సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏపీఆర్‌డీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కృష్ణ బాధ్యతలు

● భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు అభిమానులు



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నుంచి జ్ఞాపికను అందుకుంటున్న కృష్ణ

పర్చూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (ఏపీ ఆర్‌డీసీ) డైరెక్టర్‌గా పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి వెంకటకృష్ణారావు (కృష్ణ) ఆదివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ లోని ఆర్‌అండ్‌బీ శాఖ రాష్ట్ర కార్యాలయంలో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, చైర్మన్ నాగేశ్వరరావు సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. అనంతరం మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావులు అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తన పదవికి కృషి చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా మంత్రి రవికుమార్ జన్మదినం



బల్లికురవలో పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

మేదరమెట్ల నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలను కొరిశపాడు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాల్లో కేకు కట్ చేసి మంత్రి రవికుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మేదరమెట్లలో కేకు కట్ చేసిన సందర్భంగా నేతలు మాట్లాడుతూ కొరిశపాడు ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు రూ.12 లక్షలు పరిహారం ఇప్పించిన ఘనత రవికుమార్‌దే అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మండలంలోని పలు రహదారులను అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెనుబోతు సత్యనారాయణ, ఏడెం భవాని ప్రసాద్‌రెడ్డి, మేదరమెట్ల శ్రీనివాసరావు, (శ్రీను పంతులు), కొట్టే రవీంద్ర చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల కోటేశ్వర రావు, కరిచేటి రాంబాబు, ఆవుల లక్ష్మి తిరుపతి, మేదరమెట్ల బ్రహ్మయ్య, చావా రాజేష్, హరిబాబు, శేషయ్య, వడ్లమూడి శ్రీనివాసరావు, శ్రీధర్, బీజేపీ నాయకులు సాతులూరి భావనారయణ పాల్గొన్నారు.

బల్లికురవ : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలు టీడీపీ మండల అధ్యక్షుడు దూళిపాళ్ల హనుమంతురావు ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నేతలు కేక్‌ను కట్ చేసి బాలికలకు పండ్లు పంపిణీ చేశారు. మంత్రికి ఫోనులో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ దేవినేని నరేంద్ర, బల్లికురవ సొసైటీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్య, టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, యాగంటి సింగరయ్య, దద్దాల అంజయ్య, నేతలు ఆళ్ల చంద్రమౌళి, చింతల రామారావు, గుంజి సుబ్బారావు, పెంట్రాల అంజనేయులు, వేల్పుల అబ్రహం, అమరనేని వినోద్, కత్తి ఆశోక్, గోగినేని వేణు, సోసైటీ అధ్యక్షులు కొమ్మాలపాటి రామారావు, మాలపాటి వెంకటసుబ్బయ్య, విద్యాలయ ప్రిన్సిపాల్ సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షల వెల్లువ

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీల యాజమానులు ఫోనులో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారిలో కామేపల్లి ఎక్స్‌పోర్ట్సు అధినేత కామేపల్లి, లక్ష్మీప్రసాద్, గాయత్రి ఇండస్ట్రీస్ అధినేత దేవినేని శ్రీనివాసరావు, కలర్ గ్రానైట్ క్వారీ యజమానుల సంఘం అధ్యక్షులు దూళిపాళ్ల శ్రీకాంత్, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, పత్తిపాటి సురేష్, మాలపాటి పోతురాజు, శ్రీ నాగలక్ష్మీ ఫెర్టిలైజర్స్ యజమాని బెల్లంకొండ సుబ్బారావు, ఎస్ఐ వై. నాగరాజు, ఎంపీడీవో కుసుమకుమారి, ఏపీవో కోటయ్యనాయక్, తహసీల్దార్ రవినాయక్, రేషన్ దుకాణ దారుల సంఘం నేతలు శ్రీకాంత్, బొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సంతమాగులూరు : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 51వ జన్మదిన వేడుకను ఆదివారం మండలంలో పొట్టవారిపాలెంలోని గొట్టిపాటి అతిథి గృహంలో నిర్వహించారు. కార్యక్రమంలో సొంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్, టీడీపీ నాయకులు చేవూరు వాసురెడ్డి, చింత రామారావు, అట్లా పెద్దవెంకటరెడ్డి దుద్దేల చిన్నగాలయ్య, వసంత వేణుబాబు, మురళి, కామాను శ్రీనివాసరావు పసుపులేటి కోటేశ్వరరావు పలుగ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పంగులూరు : ముప్పవరం బీసీ బాలికల వసతిగృహంలో మంత్రి గొట్టిపాటి పుట్టినరోజు సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం బాల, బాలికలకు పండ్లు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, గుర్రం ఆదిశేఖర్, నార్నె సుబ్బారావు, బత్తుల వెంకటరావు, గొల్లపూడి అంజయ్య, రావుల సింగరకొండ, పూనాటి రామాంజనేయులు, పెడవల్లి అశోక్, గుదిబండ్ల చినఆదిరెడ్డి, మద్దిరెడ్డి పిచ్చిరెడ్డి, దూళిపాళ్ల వెంకట్రావు, కోమటి ప్రసాద్, జక్రయ్య, ఉన్నం రవిబాబు, జాగర్లమూడి శ్రీనివాసరావు, వలపర్ల సుబ్బారావు, గడ్డం నాగేశ్వరరావు, ధూళిపాళ్ళ నారాయణస్వామి, కాటా అంజయ్య, అద్దెపల్లి యోహోను, అమృతపూడి ఏసోబు(చిన్న), ఎల్లాల నాగిరెడ్డి, కాజాస్వామి, బాచిన సురేష్, బాచిన హరిబాబు, వేల్పుల మరియదాసు పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని చందలూరు, ముప్పవరం గ్రామాలలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో మంత్రి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పవరంలో మాలధారణ చేసిన స్వాములకు అన్నదానం చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, చందలూరులో గ్రామ సర్పంచ్ పెంట్యాల వెంకటకృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు ఎర్రమనేని వాసవిశేషారావు, పార్టీ అధ్యక్షులు రావూరి వెంకటసుబ్బారావు, స్థానిక నేతలు, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. ముప్పవరంలో నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు గరిమిడి జగన్మోహన్, శింగరకొండ, జనసేన నాయకులు ఫణి, భానుప్రకాశ్, మరియదాసు, చౌదరిబాబు, శేషగిరి, పలువురు నాయకులు పాల్గొన్నారు. చిన్నమల్లవరంలో చిలుకూరి వెంకటేశ్వర్లు సారథ్యంలో మంత్రి జన్మదిన కార్యక్రమం నిర్వహించారు.





ముప్పవరంలో కేకుకట్ చేస్తున్న నాయకులు, మేదరమెట్లలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు